ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శనివారం 12 ఏప్రిల్ 2025



జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్

జిల్లా రూపురేఖలు మారుస్తాం

- ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి
- ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం
- టీడీపీతోనే బీసీలకు సముచిత స్థానం
- బీసీ భవన సముదాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- జ్యోతిబా పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

అరసవల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 'సిక్కోలులో సుదీర్ఘ తీర ప్రాంతం, పుష్కలమైన నీటి వనరులు ఉన్నా తలసరి ఆదాయంలో జిల్లా చివరిస్థానంలో ఉండడం విచారకరం. జిల్లాను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో పీ-4 పద్ధతిలో అభివృద్ధి చేస్తాం. ఐదేళ్లలో జిల్లాకేంద్రం రూపురేఖలు మారుస్తామ'ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా శుక్రవారం పొన్నాడ వంతెన సమీపంలోని పార్కులో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో కలిసి జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాంబే కాలనీ వద్ద రూ.5కోట్లతో నిర్మించిన వెనుకబడిన తరగతుల సంక్షేమ భవన సముదాయాన్ని(బీసీ భవన్) ప్రారంభించారు. అనంతరం మంత్రి అచ్చెన్న మాట్లాడుతూ.. 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రంలో బీసీలు ఓట్లు వేసే యంత్రాలుగా మిగిలారే తప్ప.. ఎవరూ పట్టించుకోలేదు. స్వర్గీయ నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించి దేశంలోనే తొలిసారి బీసీలకు పదవుల్లో 27 శాతం వాటా కల్పించారు. రెసిడెన్షియల్ విద్యా విధానంతో లక్షలాది బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉచిత విద్యను అందజేశారు. నేడు బీసీల ఉన్నత స్థానానికి కారణం నాడు అన్న ఎన్టీఆర్, నేడు సీఎం చంద్రబాబు నాయుడే. బీసీల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యం. గతంలో రాష్ట్రంలో ఒకేసారి 65 బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేయగా.. జిల్లాకు 6 స్కూళ్లు ఇచ్చాం. టీడీపీ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాల్లోను బీసీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశాం. జిల్లాలో 4700 మందికి బీసీ రుణాలు మంజూరు చేశాం. ఇలా బీసీల అభివృద్ధికి చంద్రబాబు నేతృత్వంలో నిరంతర కృషి కొనసాగుతోంది. జిల్లాలో బీసీల కోసం ఐఏఎస్, ఐపీఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తాం. టీడీపీ హయాంలో బీసీల కోసం కొనుగోలు చేసిన పని ముట్లను గత వైసీపీ ప్రభుత్వం గోదాముల్లో ఉంచేసి దుర్వినియోగం చేసింది. వైసీపీకి బీసీలపై ఎందుకు అంత కక్ష. జిల్లాలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కృషి చేస్తుండగా కొంతమంది ఆటంకాలు సృష్టిస్తున్నారు. జిల్లా అభివృద్ధికి ప్రజల సహకారం ఎంతో అవసరం. వలసలు ఆపాలి. పారిశ్రామికంగా వృద్ధి చెందితేనే, జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతుంది. వివిధ పార్టీల నాయకులు రాజకీయాలు చెయ్యండి. కానీ అభివృద్ధిని మాత్రం దయచేసి అడ్డు కోకండి. పదవులు శాశ్వతం కాదు. పదవిలో ఉన్నప్పుడు మనం చేసే మంచి పనులే ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయి. అదే శాశ్వతం. జ్యోతిబాపూలే ఆశయాలను నెరవేరుద్దాం. అసమానతలు లేని సమాజ నిర్మాణానికి కృషి చేద్దామ'ని తెలిపారు. బీసీ భవన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీసీ లబ్ధిదారులకు చెక్కును అందజేశారు. కలెక్టర్ స్వపిల్ దినకర్ పుండ్కర్ (మిగతా 6వ పేజీలో..)



రిబ్బన్ కట్ చేసి బీసీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

అణగారిన వర్గాల ఆశాజ్యోతి

- జ్యోతిబా పూలేకి ఎస్పీ నివాళి

శ్రీకాకుళం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిబా పూలే అని ఎస్పీ మహేశ్వరరెడ్డి కొనియాడారు. సామాజిక సంఘసంస్కర్త, జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి ఎస్పీ నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ శేషాద్రి, ఆర్ఐ నర్సింగరావు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

35 రోజుల తర్వాత..

- ఇరాక్ నుంచి స్వగ్రామానికి వలస కూలీ మృతదేహం

కవిటి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కవిటి మండలం బెలగాం గ్రామానికి చెందిన వలసకూలీ టి.భుజంగరావు(45) మృతదేహం ఎట్టకేలకు శుక్రవారం స్వగ్రామానికి చేరింది. భుజంగరావు కొన్నాళ్ల కిందట ఉపాధి కోసం ఇరాక్ వెళ్లాడు. మార్చి 6న అక్కడ కంపెనీలోని ప్రమాదంలో మృతి చెందాడు. భుజంగరావును చివరి చూపు చూసేందుకు కుటుంబ సభ్యులు ఆరాటపడ్డారు. స్థానిక నేతల సహాయంతో ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌ను కలిసి ఇరాక్ నుంచి భుజంగరావు మృతదేహాన్ని తీసుకువచ్చేలా చూడాలని వేడుకున్నారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు దృష్టికి విప్ అశోక్ ఈ సమాచారాన్ని అందించి మృతదేహాన్ని తీసుకువచ్చేలా కృషిచేశారు. దాదాపు 35రోజుల తర్వాత శుక్రవారం భుజంగరావు మృతదేహం చేరుకుంది. దీంతో ఆ మృతదేహాన్ని చూసి తల్లి దమయంతి, భార్య జయలక్ష్మి, కుమార్తెలు దీక్షరిషి బోరున విలపించారు. ఇరాక్ నుంచి మృతదేహాన్ని తెప్పించేందుకు కృషిచేసిన కేంద్రమంత్రి, విప్‌కు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



భుజంగరావు (ఫైల్)

చింత తీరింది!

- దిగుబడి తగ్గినా.. కలిసివస్తున్న ధర
- గ్రామాల్లోకి వెళ్లి కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- జీసీసీకి ఇచ్చేందుకు గిరిజనుల విముఖత



- మెళియాపుట్టి మండలం అడ్డివాడ గ్రామానికి చెందిన గిరిజన రైతు సవర గణేష్‌కు కొండపైన సుమారు 20 చింత చెట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా 20 క్వింటాళ్ల చింతపండు దిగుబడి వస్తుంది. ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో 14 క్వింటాళ్ల చింతపండు మాత్రమే పండింది. గత వైసీపీ ప్రభుత్వం జీసీసీ ద్వారా కిలో చింతపండును రూ.32.40 కొనుగోలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రూ.36కి కొనుగోలు చేస్తోంది. కాగా.. బయట వ్యాపారులు ఇంటి దగ్గరకే వచ్చి కిలో రూ.49చొప్పున చెల్లిస్తున్నారు. మార్కెట్‌లో రూ.50 నుంచి రూ.60 వరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో జీసీసీకి ఇవ్వకుండా వ్యాపారులకే తాను చింతపండు విక్రయించానని గణేష్ తెలిపారు. ఈ ఏడాది దిగుబడి తగ్గినా.. మార్కెట్‌లో ధర అధికంగా ఉండడం సంతోషంగా ఉందన్నారు.
- మెళియాపుట్టి మండలం గూడ గ్రామస్థులకు ఉమ్మడి అటవీ ప్రాంతాలో సుమారు 70 చింతచెట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా 10క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ప్రతి ఏడాదీ జీసీసీ అధికారులు చింతపండును కొనుగోలు చేస్తారని గ్రామస్థులు ఎదురుచూసేవారు. ఈ ఏడాది పంట దిగుబడి తగ్గడం.. మార్కెట్‌లో ధర పెరిగింది. దీంతో కొంతమంది వ్యాపారులు గిరిజన గ్రామాలకు వెళ్లి చింతపండును కొనుగోళ్లు చేస్తున్నారు. దీంతో జీసీసీ అధికారులు కొనుగోలు చేస్తామన్నా చింతపండు లేదు.

మెళియాపుట్టి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చింతపండు రైతులకు పంట పండింది. ఈ ఏడాది దిగుబడి తగ్గినా, మార్కెట్‌లో ధర పెరగడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. జిల్లాలోని సీతంపేట, మెళియాపుట్టి, మందస, నందిగాం, కొత్తూరు, పాతపట్నం, పలాస తదితర మండలాల్లో అధికంగా చింతచెట్లు ఉన్నాయి. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 52 హెక్టార్లలో చింతచెట్లు ఉండగా.. వీటి ద్వారా ఏటా సుమారు 468 మెట్రిక్ టన్నుల వరకు చింతపండు దిగుమతి అవుతోంది. జిల్లాలో సుమారు 6.81లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఒక్కో కుటుంబానికి ఏడాదికి దాదాపు 25 కిలోల చింతపండు అవసరం ఉంటుంది. దీన్నిబట్టి చూస్తే ఏడాదికి జిల్లాకు 17,025 మెట్రిక్ టన్నుల చింతపండు అవసరం. కాగా జిల్లాలో సరిపడా దిగుబడి లేక బయట జిల్లాల నుంచి చింతపండు దిగుబడి చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో హుద్‌హుద్, తితలీ తుఫాన్ల సమయంలో కొండలపై ఉన్న చాలా చింతచెట్లు నేలకొరిగాయి. వాటి స్థానంలో అటవీశాఖ ద్వారా మొక్కలు పెంపకం చేపట్టాలి. కానీ నిధుల కొరత కారణంగా ఆశించినస్థాయిలో మొక్కలు నాటలేదు. దీంతో చింతపండు దిగుబడి తగ్గింది.

జీసీసీ కంటే.. వ్యాపారులు ముందంజ

గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ద్వారా గిరిజనులు పండించే పంటలను అధికారులు కొనుగోలు చేసి వారికి గిట్టుబాటు కల్పించేవారు. గత వైసీపీ ప్రభుత్వం కిలో చింతపండుకు రూ.32.40 చొప్పున కొనుగోలు చేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ ధరను రూ.36కి పెంచింది. కానీ ఈ ఏడాది దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో ధర కిలోరూ.60 వరకు పలుకుతోంది.

ఆశించిన స్థాయిలో దిగుబడి లేక..

పలాస రూరల్: పలాస మండలం పొత్రియ, బొపనూరు, గట్టూరు, కొఠారింగి తాళభద్ర గిరిజన గ్రామాల్లో చింతచెట్లు అధికంగా ఉన్నాయి. ఆయా గ్రామాల రైతుల చింత పంటపై ఆధారపడుతుంటారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. మార్కెట్‌లో ధర బాగున్నా.. తమకు ఫలితం లేకపోతోందని పేర్కొంటున్నారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లాలోని జిరాంగో, లంజిభద్ర వంటి గిరిజన ప్రాంతాలతోపాటు కాశీనగర్, గురండి, గుసాని ప్రాంతాలలో చింతచెట్లు అధికంగా ఉన్నాయి. అక్కడి నుంచి చింతపండును కొనుగోలు చేసి జిల్లాలోని సంతల్లో విక్రయిస్తుంటారు. ఈ ఏడాది స్థానికంగా పంట లేకపోవడంతో వ్యాపారులు ధర పెంచి విక్రయిస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒడిశా నుంచి చింతపండును కొనుగోలు చేయాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు.

దీంతో వ్యాపారులు నేరుగా గిరిజనుల వద్దకు వెళ్లి కిలో రూ.50 వరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో గిరిజన రైతులకు కలిసివస్తోంది. జీసీసీ అధికారులు కొనుగోలు చేసేవరకూ వేచి చూడకుండా వ్యాపారులకు చింతపండును విక్రయిస్తున్నారు.

లక్ష్యానికి మించి కొనుగోలు

ఈ ఏడాది గిరిజన ఉత్పత్తులు లక్ష్యానికి మించి కొనుగోలు చేశాం. రూ.31.50 కోట్ల గిరిజన ఉత్పత్తులు కొనుగోలు చేయాలని నిర్ణయించాం. ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది రూ.43.97 కోట్ల వరకు ఉత్పత్తులు కొనుగోలు చేశాం. ఇప్పటివరకూ 200 క్వింటాళ్ల చింతపండు కొనుగోలు చేశాం. దిగుబడి తగ్గడం వల్ల ధర పెరిగింది.

-నర్సింహులు,
జీసీసీ మేనేజర్, పాతపట్నం



గూడలో గిరిజనులు ఎండబెట్టిన చింతపండు

సమాచారం

నేడే ఇంటర్ ఫలితాలు

- 9552300009 వాట్సాప్ నెంబర్‌తో నేరుగా సమాచారం

నరసన్నపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఫలితాలను శనివారం విడుదల చేయనున్నట్లు రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి లోకేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పరీక్షలురాసే విద్యార్థులు 9552300009 నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అని హాల్‌టికెట్ నెంబర్ మెసేజ్ పంపి ఫలితాలను పొందవచ్చు. శనివారం ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నారు. జిల్లాలో గత నెల ఒకటో తేదీ నుంచి 16 వరకు 75 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలను నిర్వహించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 21,127 మంది విద్యార్థులకు 20,442 మంది పరీక్షలకు హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 18,782 మందికి 18,445 మంది పరీక్షలు రాశారు. వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించడంపై విద్యార్థులు వ్యక్తం చేస్తున్నారు.

నేడు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు పనిచేస్తాయి

- జిల్లా రిజిస్ట్రార్ నాగలక్ష్మి

అరసవల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు శనివారం యథావిధిగా తెరచుకోనున్నాయని జిల్లా రిజిస్ట్రార్ ఏ.నాగలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ప్రతినెలా రెండో శనివారం రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు సెలవు. కానీ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఈ శనివారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5 వరకు యథావిధిగా పనిచేస్తాయి. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సేవలు పొందాల'ని ఆమె సూచించారు.



రాళ్లు.. బంగారం.. ఒక్కటేనంట!

- రెండింటికీ సమానంగా రేటుకట్టి వసూలు
- బంగారు దుకాణాల్లో పెరుగుతున్న మోసాలు
- తూకాల్లోనూ తేడాలు..
- కనిపించని హాల్‌మార్క్
- వేయింగ్ మిషన్లు రెన్యువల్ చేయించని వైనం

- నరసన్నపేటలోని ఒక బంగారం దుకాణంలో గతేడాది జనవరిలో ఓ వ్యక్తి 12 గ్రాముల బరువైన నల్లపూసల బ్రాస్‌లెట్ కొనుగోలు చేశాడు. రెండు రోజుల తర్వాత దానిని మార్చేందుకు అదే దుకాణానికి వెళ్లాడు. కాగా.. నల్లపూసలు విడిచిపెట్టి సంబంధిత బ్రాస్‌లేట్ 10 గ్రాములు మాత్రమే ఉంటుందని.. ఆ మేరకే కొనుగోలు చేస్తామని షాపు యాజమాని చెప్పాడు. బంగారు ఆభరణాలు అమ్మే సమయంలో 12 గ్రాములకు తూకం వేసి.. నేడు 10 గ్రాములకు తీసుకోవడం సరికాదని ఆ వ్యక్తి నిలదీశాడు. తరుగు ఉంటుందని. నల్లపూసల్లో మట్టి చేరుతుందని యాజమాని బుకాయించాడు.

జిల్లాలో చాలాచోట్ల బంగారం దుకాణాల్లో ఇదే తరహా మోసాలు జరుగుతూనే ఉన్నాయి. విక్రయాల సమయంలో రాళ్లతో ఉన్న బంగారం ఆభరణాలను మొత్తంగా తూకంగా వేసి వినియోగదారులను దోచుకుంటున్నారు.

నరసన్నపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బంగారం ఆభరణాల దుకాణాల్లో మోసాలు పెరిగిపోతున్నాయి. రాళ్లతో ఉన్న బంగారం నగలను కొనుగోలు చేస్తే షాపు నిర్వాహకుడు రాళ్లు, బంగారాన్ని వేర్వేరుగా తూకం వేసి, ధర లెక్కకట్టాలి. ఎందుకంటే బంగారం, రాళ్ల ధరకు చాలా వ్యత్యాసం ఉంటుంది. కానీ చాలా దుకాణాల్లో అలా చేయట్లేదు. ఆభరణం(నగ) మొత్తంగా తూకం వేసి బంగారంతో సమానంగా రాళ్లకూ ధర కట్టి వినియోగదారులకు కుచ్చుటోపి పెడుతున్నారు. అర్హత లేని వేయింగ్ మిషన్లతో మోసం చేస్తున్నారు. వాటిని కనీసం రెన్యూవల్ చేయడం లేదు. దీంతో జిల్లాలోని కొన్ని షాపుల్లో నిర్వాహకులు చెప్పిందే తూకంగా, ఇచ్చిందే బంగారంగా మారిపోయింది. కొంత మంది వ్యాపారులు హాల్‌మార్క్ వేసి బంగారు ఆభరణాలను విక్రయించకుండా మోసాలకు పాల్పడుతున్నారు. తరచూ తనిఖీలు చేస్తూ ఈ మోసాలకు చెక్ (మిగతా 6వ పేజీలో..)

డీఎంహెచ్‌వోగా డా.అనిత బాధ్యతల స్వీకరణ

అరసవల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన వైద్యారోగ్యశాఖాధికారిగా డాక్టర్ కె.అనిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత డీఎంహెచ్‌వో డాక్టర్ బాలమురళీకృష్ణ ఇటీవల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. దీంతో ఆయన స్థానంలో డాక్టర్ అనితను డీఎంహెచ్‌వోగా నియమిస్తూ డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ నుంచి ఉత్తర్వులు అందాయి. డా.అనిత ఇప్పటివరకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో సీఎస్ ఆర్ఎంవోగా పనిచేశారు. శుక్రవారం డీఎంహెచ్‌వోగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు చేపట్టారు.



ఆదిత్యాలయంలో ఫీడ్‌బ్యాక్ స్కానర్

- భక్తుల సలహాలు, సమస్యలు నేరుగా సీఎం పేషీకి

అరసవల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అరసవల్లిలో ఆదిత్యుడ్ని దర్శించుకునేందుకు నిత్యం వేల సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఆలయంలో సరైన సేవలు అందక కొంతమంది భక్తులు ఇబ్బందులు పడుతుంటారు. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతుంటారు. ఈ నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం అధికారులు ఆలయం బయట ఫీడ్‌బ్యాక్ స్కానర్‌ను ఏర్పాటు చేశారు. ఆదిత్యుడి ఆలయంలో సేవలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైనా దీనిద్వారా భక్తులు చెప్పుకోవచ్చు. ఆలయ కార్యక్రమాలకు సంబంధించి, సలహాలు, సూచనలు ఏమైనా ఇవ్వవచ్చు. భక్తులు ఫోన్ ద్వారా వివరాలను రిజిస్టర్ చేసుకోవాలి. గూగుల్ స్కాన్ లేదా క్యూఆర్ కోడ్‌తో 'ఫీడ్‌బ్యాక్'ను స్కాన్ చేసి.. సమస్యలు, సూచనలను నేరుగా పంపించవచ్చు. ఇలా పంపిన మెసేజ్‌లు నేరుగా సీఎం పేషీకి, దేవదాయశాఖ కమిషనర్, ముఖ్య కార్యదర్శి కార్యాలయాలకు వెళ్తాయి. తద్వారా సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారు.



రూపు కోల్పోతున్న కాలువలు

- మట్టి, మురుగు, చెత్తతో నిండిన 'వంశధార- దేశబట్టి'
- శిథిలావస్థలో కేశుపురం అక్విడెక్ట్

8లో

రిమ్స్‌లో ఆహార భద్రత అధికారుల తనిఖీ

- ఆహారం నాణ్యతా లోపంపై కాంట్రాక్టర్‌కు నోటీసు
- రోగులకు పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలని ఆదేశం

6లో



కళ్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.


కళాకారుల నృత్యం


పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు




ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం


ఎదుర్కోలు దృశ్యం




సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

జిల్లా రూపురేఖలు మారుస్తా

(ఐదో పేజీ తరువాయి)

మాట్లాడుతూ.. 'బీసీ భవన్ బీసీ వెల్ఫేర్ విభాగానికి ఒక గొప్ప ఆస్తి. అందరూ సమర్థవంతంగా పని చేయాలి. మనం చేయాల్సింది ఇంకా ఎంతో ఉంద'ని తెలిపారు. ● శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లా డుతూ.. 'బీసీలకు సముచిత స్థానం జ్యోతిబా పూలే చలువే. గత వైసీపీ ప్రభుత్వం బీసీ భవన్ నిర్మాణా నికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే భవనాన్ని పూర్తిచేసి.. ప్రారంభించాం. ఇది మంత్రి అచ్చెన్న పట్టుదలకు నిదర్శనమ'ని తెలిపారు. ● నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. బీసీల సంక్షేమ టీడీపీతోనే సాధ్యమని తెలిపారు. జ్యోతి బాపూలే జయంతి రోజున బీసీ భవన్‌ను ప్రారంభించడం ఎంతో ముదావహమన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, బీసీ సంక్షేమాధికారి అనూరాధ, తహసీల్దార్ గణపతిరావు, బీసీ సెల్ అధ్యక్షుడు కలగ జగదీష్, మాదారపు వెంకటేష్, కంఠ వేణు, ఎస్వీ రమణ మాదిగ, రత్నాల మురళీమోహన్, కిల్లాన శ్రీనివాసరావు, చౌదరి బాబ్జీ, పీరుకట్ల విశ్వప్రసాద్, గుత్తు చిన్నారావు, పైడిశెట్టి జయంతి పాల్గొన్నారు.


బీసీ లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు


కార్యక్రమానికి హాజరైన ప్రజలు

తల్లి చితికి నిప్పంటించిన కుమార్తె

కంచిలి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పొట్ట చేత పట్టుకొని ఉపాధి కోసం వెళ్లిన కొడుకు తల్లికి తలకొరివి పెట్టే అదృష్టానికీ నోచుకోలేదు. దీంతో వికలాంగురాలైన కుమార్తె తల్లికి అంతిమ సంస్కారాలను పూర్తి చేసింది. చిన్న కొజ్జిరియాలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. పొందల జగన్మోహిని (75) అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూసింది. ఆమెకు కొడుకు శివాజీ, కుమార్తె నాగమ్మ ఉన్నారు. కొడుకు ఉపాధి కోసం వెళ్లి.. బెంగుళూరులో ఉంటున్నాడు. కూతురు నాగమ్మ వికలాంగురాలు. జగన్మోహిని చనిపోయినట్టు సమాచారాన్ని కుమారుడికి అందించారు. ఆయన సకాలంలో రాలేకపోవడంతో గ్రామ పెద్దల సూచనతో కూతురు నాగమ్మ తన తల్లికి అంతిమ సంస్కారాలు పూర్తి చేసింది.


తల్లికి అంతిమ సంస్కారాలు చేస్తున్న నాగమ్మ

రాళ్లు.. బంగారం ఒక్కటేనంట!

(ఐదో పేజీ తరువాయి)

పెట్టాల్సిన తూనికలు, కొలతలు అధికారులు కన్నెత్తి చూసే దాఖలాలు కనిపించడం లేదు. ఆ శాఖకు తగిన సిబ్బంది లేకపోవడంకూడా ఒక కారణమని సమాచారం.

● జిల్లాలో శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస-కాశీబుగ్గ, పాతపట్నం, టెక్కలి, ఆమదాలవలస, సోంపేట, బ్రాహ్మణతర్ల, రణస్థలం, మందస, ఇచ్ఛాపురం పట్టణాల్లో సుమారు 600 బంగారం దుకాణాలు ఉన్నాయి. శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో బంగారం షాపులు 400 పైగా ఉన్నాయి. నరసన్నపేటలోనే ఎనిమిది హోల్‌సేల్ వ్యాపార సంస్థలు ఉన్నాయి. జిల్లాలో ఇతర పట్టణాలతోపాటు ఇతర రాష్ట్రాలకు నరసన్నపేట నుంచే బంగారం ఆభరణాలు లావాదేవీలు జరుగుతుంటాయి. బంగారం వ్యాపారానికి బ్రాండ్‌గా ఉన్న నరసన్నపేటతోపాటు ఇతర పట్టణాల్లో కొందరు వ్యాపారులు వినియోగదారులకు మోసాలకు పాల్పడుతూ కుచ్చుటోపీ పెడుతున్నారు.

స్వచ్ఛత సంగతేంటో..?

బంగారం ఆభరణాలు కొనుగోలు చేసేందుకు వెళ్తే దుకాణ నిర్వాహకుడు చెప్పిన మేరకే స్వచ్ఛత అని వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. అది 22 క్యారెట్లా, 24 క్యారెట్లా అని వినియోగదారులు గుర్తించలేకపోతున్నారు. పలు బంగారం షాపుల యాజమానులు తూకాల్లో చేస్తున్న మోసాన్ని గ్రహించలేకపోతున్నారు. వినియోగదారులకు బంగారంపై ఉన్న మక్కువను కొంతమంది వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు.

● చాలా మంది.. రాళ్ల బంగారంపై ఎక్కువ మక్కువ చూపుతుంటారు. చేతి ఉంగరాలు, చైన్‌లాకెట్‌లు, నక్లెస్ తదితరాలను రాళ్లతో తయారు చేయించికుంటారు. బంగారం ధర, స్టోన్ ధరల్లో చాలా వ్యత్యాసాలున్నాయి. కొంత మంది బంగారు దుకాణదారులు వీటి విక్రయాల సమయంలో వినియోగదారులను మోసం చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఎవరైనా రాళ్లతో ముడిపడిన బంగారం ఆభరణాలు కొనుగోలు చేస్తే బంగారం, రాళ్లను వేర్వేరుగా తూకం వేయాలి. వాటి ధరలను బిల్లుల్లో సైతం వేర్వేరుగా చూపించాలి. 10 గ్రాములు స్టోన్ కలిగిన ఉంగరం తీసుకుంటే.. అందులో దాదాపు ఒక మిల్లీ గ్రాము స్టోన్ ఉంటే కొందరు కేటుగాళ్లు మొత్తం 10 గ్రాములు బంగారం ధరకే అమ్మేస్తున్నారు. మరికొంతమంది కేటుగాళ్లకు 30 మి.ల్లీ గ్రాములు స్టోన్ ఉంటే.. 10 మిల్లీ గ్రాములు స్టోన్ ఉంటుందని చెప్పి.. 20 మిల్లీగ్రాములు రాళ్ల ధరను బంగారం ధరకే తీసుకుంటారు. కొన్ని బంగారం ఆభరణాలకు ఉన్న రాళ్లను కొనుగోలు చేసే సమయంలో వాటిని తీసేందుకు అవకాశం ఉండదు. షాపు నిర్వాహకుడు ఎంత చెబితే అంతే. దీంతో రాళ్ల బరువు మినహాయించి కొందరు బంగారం ఆభరణాలు విక్రయించి దోచుకుంటున్నారు.

వేయింగ్ మిషన్ల రెన్యువల్ ఏదీ?

సాధారణంగా బంగారం దుకాణాల వ్యాపారులు తమ వద్ద ఉన్న వేయింగ్ మిషన్లకు తూనికలు, కొలతల శాఖ నుంచి రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకోవాలి. కానీ చాలామంది ఈ సర్టిఫికెట్లు లేకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఎన్ని బంగారం దుకాణాలు ఉన్నాయి. ఎంతమంది రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్ని బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల విషయానికొస్తే వారు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందగా తయారైంది. ఫైనాన్స్ సంస్థల్లోకి బంగారం నగలను తాకట్టు పెట్టుకునేందుకు వెళ్తే.. వారు వేసిన తూకం.. ఇచ్చే డబ్బు తీసుకుని రావాల్సిందేనన్న బాధితులు వాపోతున్నారు. కొందరు ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకు నిర్వాహకులు వేయింగ్ మిషన్లలో తక్కువ తూకాలు నమోదు చేసుకుని, వినియోగదారులను మోసం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఫైనాన్స్ సంస్థలు, బ్యాంకులు, బంగారు దుకాణాల్లో వేయింగ్ మిషన్లకు రెన్యువల్ సర్టిఫికెట్లు తీసుకున్నారా.. లేదా అని పరిశీలించాల్సిన తూనికలు, కొలతల శాఖాధికారులు పట్టించుకోవడం లేదు. ఈ క్రమంలో మోసాలు పెరుగుతూనే ఉన్నాయని వినియోగదారులు వాపోతున్నారు.

నిఘా పెడతాం..

జిల్లాలో బంగారం దుకాణాల్లోని తుకాల్లో తేడాలపై నిఘా పెంచుతాం. ప్రతీ షాపు యాజమాని తప్పనిసరిగా వేయింగ్ మిషన్లు రెన్యువల్ చేయించుకోవాలి. రాళ్లతో కలిసి బంగారం ఆభరణాలు తూకాలు వేయరాదు. బంగారం, రాళ్ల వేర్వేరుగా తుకాలు వేసి బిల్లులు ఇవ్వాలి. ఫిర్యాదులు వస్తే షాపు యాజమానులపై చర్యలు తీసుకుంటాం.

-విశ్వేశ్వరరావు, సహాయక నియంత్రకులు, తూనికలు, కొలతలశాఖ, శ్రీకాకుళం

రిమ్స్‌లో ఆహార భద్రత అధికారుల తనిఖీ

- రోగులకు పరిశుభ్రమైన భోజనాన్ని అందించాలి
- ఆహారంలో నాణ్యతా లోపంపై కాంట్రాక్టర్‌కు నోటీసు
- జిల్లా ఆహార భద్రత, నియంత్రణాధికారి వెంకటరత్నం

అరసవల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో రోగులకు సరఫరా చేసే ఆహారాన్ని జిల్లా ఆహార భద్రత, నియంత్రణాధికారి కె.వెంకటరత్నం శుక్రవారం డైటీషియన్ సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు పరిశుభ్రమైన ఆహారాన్ని అందజేయాలని సంబంధిత కాంట్రాక్టరును ఆదేశించారు. కాంట్రాక్టరుకు లైసెన్సు లేదని, తక్షణమే పొందాలన్నారు. వంట గదిని ఆయన పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించి, ఆహారం తయారు చేసేవారు శుభ్రత పాటించాలని... పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. లేదంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారికి నాణ్యత లేని ఆహారాన్ని సరఫరా చేస్తే వారి ఆరోగ్యం మరింత క్షీణిస్తుందని అన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆయన ఫోనులో సంప్రదించడానికి ప్రయత్నించగా... ఆమె అందుబాటులో లేరు. ఆహారం విషయంలో నాణ్యత కొరవడిందని, దీన్ని మెరుగుపరచాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశారు. అలాగే ఆహార నమూనాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి లక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న ఆహార నియంత్రణాధికారి వెంకటరత్నం

చర్లపల్లి-శ్రీకాకుళం మధ్య 24 వేసవి ప్రత్యేక రైళ్లు

ఆమదాలవలస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు మధ్య 24 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 11 నుంచి జూన్ 27 వ తేదీ వరకు ప్రతి శుక్రవారం చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు రైలు (07025), ఏప్రిల్ 12వ తేదీ నుంచి జూన్ 28 వరకు ప్రతి శనివారం శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి (07026) మధ్య ఈ ప్రత్యేక రైళ్ల రాకపోకలు సాగిస్తాయి.


అమ్మవారి గజముద్దలు, కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

ఘనంగా సంతోషిమాతకు పూజలు

ఇచ్ఛాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని 21వ వార్డుకు చెందిన మహిళలు సంతోషిమాత ఉజ్జాపనను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. 16 వారాలు భక్తిశ్రద్ధలతో సంతోషిమాతకు పూజలు చేసి...ఉజ్జాపన చేసినట్టు భక్తులు తెలిపారు. ఉజ్జాపనలో ఉంచిన పూర్ణ కలశాలను స్థానిక సయ్యద్‌ఖాన్ చెరువులో నిమజ్జనం చేశారు.



ఆటాడుకుందాం.. రండి

- క్రీడా మైదానాల్లో విద్యార్థుల సందడి

శ్రీకాకుళం స్పోర్ట్స్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం. ఆపై ఒంటిపూట బడులు. ఇక విద్యార్థులకు హద్దేముంటుంది? క్రీడా మైదానాలు... ఖాళీ స్థలాలను క్రికెట్, వాలీబాల్ తదితర ఆటలకు చిరునామాగా మార్చేస్తున్నారు. మధ్యాహ్నం మండుటెండను సైతం లెక్క చేయకుండా ఆటల్లో మునిగి తేలుతున్నారు. ఇక సాయంత్రాలైతే సందడే సందడి. నగరంలోని 80 అడుగుల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో ఎక్కువ సంఖ్యలో చిన్నారులు ఆటలాడుతూ కనిపిస్తున్నారు. కొందరు సైకిళ్లు నడపడం నేర్చుకుంటున్నారు. అక్కడే కాదండోయ్... కాలనీల్లో చిన్న స్థలం ఉన్నా చిన్నారులు దానిని క్రీడామైదానంగా మార్చేస్తున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తి కావడంతో ఆ విద్యార్థులు సైతం మైదానాల్లో ఎక్కువ సమయం గడుపుతున్నారు.


ఖాళీ స్థలాల్లో వివిధ ఆటలాడుతున్న విద్యార్థులు


సైకిల్ నేర్చుకుంటున్న చిన్నారులు

ఆలయాల దర్శనానికి సైకిల్ యాత్ర


లక్ష్మీనరసింహా స్వామి ఆలయం వద్ద సాయి శివరామకృష్ణ

గార, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం ప్రాంతానికి చెందిన 23 ఏళ్ల వయస్సు గల యువకుడు సాయి శివరామకృష్ణ రాష్ట్రంలోని హిందూ దేవాలయాల సందర్శనకు సైకిల్ యాత్ర చేపట్టాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం బూరవల్లి గ్రామానికి చేరుకుని ప్రసిద్ధ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయాన్ని దర్శించి, ఆలయ చరిత్రను అర్చకులు ఆరవెల్లి సీతారామస్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ.. డిప్లమో చదివిన తాను రాష్ట్రంలో చారిత్రక ప్రసిద్ధి చెందిన దేవాలయాలను దర్శిస్తూ, వాటి ప్రత్యేకతలు తెలుసుకునేందుకు గత నెల 26న తన స్వగ్రామం నుంచి సైకిల్ యాత్ర ప్రారంభించినట్టు చెప్పారు. ఇంత వరకు కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పర్యటించి ప్రసిద్ధ ఆలయాలను దర్శించుకున్నట్టు తెలిపారు. మిగిలిన జిల్లాల్లోని దేవాలయాలను దర్శించనున్నట్టు తెలిపారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి

అరసవల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్లాట్‌ఫారం, గిగ్ కార్మికుల వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ అజయ్ కార్తికేయ తెలిపారు. ఈ పోర్టల్‌లో నమోదుకు జొమాటో, ఉబర్, ఓలా, బ్లింకిట్, అమెజాన్, స్విగ్గీ, ర్యాపిడో, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థల్లో కార్మికులుగా పనిచేస్తున్న 18 నుంచి 59 మధ్య వయసు గల వారు అర్హులని తెలిపారు. నమోదు చేసుకున్న వారికి 12 అంకెల యూఏఎన్ఐ గుర్తింపు కార్డు వస్తుందని, ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబానికి రూ.2లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.1లక్ష ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఆరోగ్య బీమాగా రూ.5 లక్షలు ఉంటుందని, కేటాయించిన ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం లభిస్తుందన్నారు. వివరాలకు టోల్‌ఫ్రీ నెంబర్ 14434కు సంప్రదించాలన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత


పాదయాత్ర చేస్తున్న స్వామిజీ

శ్రీకాకుళం కల్చరల్/ అరసవల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకోవడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని దత్త విజయానంద స్వామి అన్నారు. నగరంలో ఉన్న దత్తాత్రేయ స్వామి ఆలయానికి శుక్రవారం వచ్చిన ఆయన భక్తులతో మాట్లాడుతూ.. భగవన్నామస్మరణతో మనశ్శాంతి కలుగుతుందన్నారు. చిన్నప్పటి నుంచే తమ పిల్లలకు హిందూ సంప్రదాయాలు, పండుగ విశేషాలను తెలియజేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అన్యమత ప్రచారాన్ని హిందువులంతా అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయన అరసవల్లి సూర్యనారాయణ స్వామిని, రమ్య తిరుమలలోని వేంకటేశ్వర స్వామిని, మరికొన్ని ఆలయాలను దర్శించుకున్నారు. దత్తాత్రేయ క్షేత్రం నుంచి అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం వరకు పాదయాత్ర చేశారు. ఈ కార్యక్రమాల్లో పన్నాల నరసింహమూర్తి, బాబ్జీ, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో స్వచ్ఛత కార్యక్రమాలు

గార, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఏర్పడి 45 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం ఉదయం బూరవల్లి, అంబళ్లవలస గ్రామాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ విద్యా ప్రమాణాలు పెంచేందుకు దేశవ్యాప్తంగా పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు అభివృద్ధి చేశారన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ క్లాస్‌రూమ్‌లు పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఉన్న దేవాలయాలు దర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పండి యోగేశ్వరరావు, గొలివి కరుణాకరరావు, అప్పారావు, పాపారావు, నారాయణరావు, గూడేటి శ్రీను, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి పూజలు

శ్రీకాకుళం కల్చరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బలగ అయ్యప్ప స్వామి ఆలయంలో అర్చకులు దేవరకొండ శంకర్‌నారాయణ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అదేవిధంగా పాత శ్రీకాకుళం కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన ధర్మశాస్త్ర దేవాలయంలో శుక్రవారం అయ్యప్ప స్వామికి సుప్రభాత సేవ, అష్టద్రవ్యాలతో అభిషేకం, అలంకరణ, స్వామి వారికి కర్పూర నీరాజనం నిర్వహించారు.

40 కుర్చీలు వితరణ

కవిటి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బొరివంకలో జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు పూర్వ విద్యార్థులు 40కుర్చీలను శుక్రవారం వితరణగా అందించారు. 1987-89లో పాఠశాలలో 10వ తరగతి చదివిన విద్యార్థులు వీటిని అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ, పూర్వ విద్యార్థులు ఎస్.శ్రీపతి, ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'పల్లెనిద్ర'

● ఎమ్మెల్యే గొండు శంకర్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

గార, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే పల్లెనిద్ర చేసినట్టు ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం బందరువానిపేటలో ఆయన పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొని, వీధుల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధుల్లో మురుగునీరు, విద్యుత్తు సమస్యలు, తాగునీరు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బందరువానిపేటలో తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.82లక్షల నిధులు మంజూరు చేశారు. కార్యక్రమంలో మండల అధికారులు, నాయకులు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ పనులు పూర్తిచేయాలి


పనులు పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

అరసవిల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గల అంబేడ్కర్ జంక్షన్‌లో చేపట్టిన బాబా సాహెబ్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 14న జరుగనుంది. ఇందుకు సంబంధించిన పనులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విగ్రహ ఏర్పాట్ల పనులు త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. జంక్షన్ మధ్యలో ఉండే వైర్లు, స్తంభాలను తొలగించాలని స్పష్టం చేశారు. కార్పొరేషన్ అధికారులతో పాటు, కాంట్రాక్టరుకు కాంస్య విగ్రహం ఏర్పాటుకి సంబంధించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ నెల 13వ తేదీ నాటికి పనులన్నీ పూర్తి కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, మునిసిపల్ హెల్త్ అధికారి సుధీర్‌కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష తమలపాకులతో అర్చన



ఇచ్ఛాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధి జర్నలిస్ట్ కాలనీలో నూతనంగా నిర్మించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా శుక్రవారం లక్ష తమలపాకులతో హనుమాన్‌కు అర్చన, సింధూరంతో పూజలు, ప్రత్యేక హోమాలు జరిపారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధన పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు కళ్లేపల్లి ప్రసాద్, వెంకటరావు, బాల, అరుణ్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసం.. ఉత్సాహం

● సందడిగా బీఆర్ఏయూ వార్షికోత్సవం


ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

ఎచ్చెర్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కుర్రకారు కేరింతలతో వర్సిటీ ప్రాంగణం హోరెత్తింది. ఉత్సాహంగా ఉల్లాసంగా స్టెప్పులేస్తూ స్టేజీ దద్దరిల్లేలా చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ 17వ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం సందడిగా సాగింది. వర్సిటీ క్రీడామైదానంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొని సంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. యువత లక్ష్యాలను చేరుకునేందుకు వర్సిటీ ఒక వేదిక అని చెప్పారు. జీఎంఆర్ ఎయిర్ ఫోర్స్ చీఫ్ లక్కీవర్మ మాట్లాడుతూ.. నిరంతర కృషి, విలువలతో కూడిన ప్రయాణం ఎన్నో విజయ శిఖరాలకు చేరుస్తుందన్నారు. వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత వర్సిటీ నివేదికను చదివి వినిపిం చారు. వర్సిటీ ప్రిన్సిపాల్స్ ఎస్.ఉదయభాస్కర్, ఎం.అనూరాధ, సీహెచ్ రాజశేఖరరావు, ప్రోగ్రాం కన్వీనర్, కల్చరల్ కోఆర్డినేటర్ పి.రవికుమార్, కె.ఉదయకిరణ్ తదితరులు పాల్గొని మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గరిష్టవేతనం అందేలా చూడాలి

పొందూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులకు గరిష్టవేతనం అందేలా చూడాల్సిన బాధ్యత ఉపాధి సిబ్బందిదేనని డ్వామా పీడీ పి.సుధాకరరావు అన్నారు. ఉపాధి పనులకు వేతనదారులు తక్కువగా హాజరుకావడంపై ఉపాధి సిబ్బందితో శుక్రవారం ఉపాధి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గతేడాది జిల్లాతో పాటు మండలంలోను గరిష్టవేతనంగా రూ.249 వేతనదారులకు అందిందని గరిష్టవేతనం రూ.307కు పెంచేలా ఉపాధి వేతనదారులతో పనులు చేయించాలన్నారు. ప్రస్తుతం వేసవి అలవెన్సులు లేవని, పనుల వద్ద సౌకర్యాలు ఉపాధి కూలీలే కల్పించుకోవాలని తెలిపారు. పీడీ పలు రికార్డులను పరిశీలించారు. సమీక్షలలో ఎంపీడీవో మన్మథరావు, ఏపీవో శ్రీనివాసరావు, టీఏలు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా

గుజరాతీపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): న్యాయశాఖ విద్యలో విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఈ మేరకు జిల్లా కోర్టు ఆవరణలో న్యాయసేవా సదన్‌లో శుక్రవారం లా కళాశాల విద్యార్థులు కోర్టును సందర్శించి జిల్లా న్యాయాధికారిని కలుసుకున్నారు. అన్ని చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం కోర్టులో జరుగుతున్న కార్యకలాపాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజు, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, లా కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

లోపాలు సరిదిద్దాలి

గుజరాతీపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మోడల్ పాఠశాలల విధానంలో ఎన్నో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దాలని ఉపాధ్యాయ సంఘాలు గగ్గోలు పెడుతున్న ఉన్నతాధికారులు సమస్యలపై చర్చిస్తామంటూ మొక్కుబడి సమావేశాలు నిర్వహిస్తున్నారని ఎస్టీయు జిల్లా అధ్యక్షుడు ఎస్.రమణమూర్తి అన్నారు. స్థానిక క్రాంతి భవన్‌లో శుక్రవారం ఎస్టీయూ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలో 1854 ప్రాథమిక పాఠశాలలో కేవలం 451 పాఠశాలలనే అధికారులు మోడల్ ప్రైమరీగా ప్రొపోజ్ చేశారన్నారు. ప్రభుత్వం తరగతుల విలీనంతో పేద విద్యార్థులకు విద్యకు దూరం చేస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ, సభ్యులు సీహెచ్ రామారావు, కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, ఎన్.లక్ష్మణరావు, డీవీఎన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ మంజూరు కోసం వినతి

కవిటి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సీహెచ్ కపాసుకుద్ది గ్రామంలో ఉన్న పాఠశాలను హైస్కూల్‌గా మార్చాలని ఎంఈవో ధనుంజయ మజ్జికి శుక్రవారం వినతిపత్రాన్ని అందించారు. మా గ్రామంలోని పాఠశాలలో 301మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేయుచున్నారని ఉన్నత పాఠశాలగా మార్పుచేయాలని కోరారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళతానని ఎంఈవో చెప్పారన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

పొందూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మొదలవలస గ్రామస్థులు ఐదేళ్లగా ఎదుర్కొంటున్న లోవోల్టేజీ విద్యుత్ సమస్య ఎంఎల్ఏ, పీయూసీ ఛైర్మన్ కూన రవికుమార్ చొరవతో పరిష్కారమైంది. గ్రామంలో ఐదేఏళ్ళుగా లోవోల్టేజీ సమస్య ఉంది. గ్రామంలో ట్రాన్స్ ఫార్మర్‌లు, లైనులు పాడవడం తో లోవోల్టేజీ సమస్య ఏర్పడింది. దీంతో వేసవికాలంలో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందిపడ్డారు.

ఆదిత్యాలయంలో తిరుమంగయాళ్వారుల చరిత్ర



అరసవల్లి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఆదిత్యుని కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుమంగయాళ్వారుల చరిత్ర (దొంగ దోపోత్సవం) కార్యక్రమం వైభవంగా జరిగింది. తొలుత స్వామివారిని ఉషా, ఛాయా, పద్మినీ సమేతంగా ఉత్సవ మూర్తులను అలంకరించి సింహ వాహనంపై ఊరేగింపుగా అరసవల్లిలో గల స్వామివారి చిన్నతోటలో వేంచేపు చేశారు. అలాగే తిరుమంగయాళ్వారుని పెద్దతోటలో ఉంచారు. అనంతరం తిరుమంగయాళ్వారుల చరిత్ర, పండితుల సంవాదం జరిగింది. అనంతరం విన్నపములు, హారతి, ప్రసాద వితరణ నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలని, సంభవించినప్పుడు ఎటువంటి ప్రాణహాని లేకుండా తీసుకోవల్సిన జాగ్రత్తల కోసం డీపీఎం రాము వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాటి నుంచి ఎలా బయటపడాలో మాక్‌డ్రిల్ ద్వారా శుక్రవారం జీరుపాలెం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాల్లో చిక్కుకున్న మనుషులను ఎలా రక్షించాలో పలు విన్యాసాలు ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ప్రసాద్, ఫైర్ అధికారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా నిలవాలి


మాట్లాడుతున్న వీసీ కేఆర్ రజని

ఎచ్చెర్ల, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులైన చిన్నారుల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో భారత పునరావాస మండలి (ఆర్‌సీఐ- న్యూ ఢిల్లీ)తో కలిసి వర్సిటీ విద్యా విభాగం జాతీయ విద్యా విధానం -2020 సూచన సంఘటిత విద్య అనే అంశంపై మూడు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. జాతీయ మేథో వికలాంగుల సాధికారిత సంస్థ (సికింద్రాబాద్) అధ్యాపకురాలు డాక్టర్ కె.లలిత, అదనపు సమన్వయకర్త డాక్టర్ ఎస్.శశిభూషణ్ వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

రణస్థలం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ అధికారి కోరాడ త్రినాథరావు అన్నారు. శుక్రవారం అల్లివలస, కోటపాలేం, పాతర్లపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఏడీఏ భవానీశంకర్, వ్యవసాయ అధికారి విజ య్ భాస్కర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు పరిశీలన

జి.సిగడాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై ఇచ్చిన వ్యవసాయ పనిముట్లను ఏవో ఎర్రా శారద శుక్రవారం పెంట, ఆనందపురం, వాండ్రంగి, సంతవురిటి, ఆబోతుపేట, చెట్టుపొదిలాం గ్రామాల్లో పరిశీలించారు, నివేదికలు ఉన్నతాధికారులకి పంపిస్తామ న్నారు.

స్కిల్స్‌పై దృష్టిసారించండి

గుజరాతీపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు స్కిల్స్‌పై దృష్టిసారించాలని చీఫ్ ప్లానింగ్ అధికారి (కలెక్టరేట్) వీఎస్ఎస్ఎల్ ప్రసన్న అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, విద్యార్థుల ప్రగతిపై వివరించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

వెండి కిరీటం బహూకరణ

కవిటి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చింతామణి అమ్మవారికి గ్రామానికి చెందిన ఉషోదయ గౌరవ అధ్యక్షుడు బి.చిట్టిబాబు, మంగమ్మ దంపతులు శుక్రవారం వెండికిరీటాన్ని వితరణగా అందించారు. అమ్మవారికి రూ.1.50 లక్షలు విలువ కలిగిన వెండి కిరీటానికి జి.మన్మథరావు ప్రత్యేకపూజ లు నిర్వహించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

జి.సిగడాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సీడీపీవో డోల పాపినాయుడు అన్నారు. శుక్రవారం వెలగాడ, ఎస్పీఆర్ పురం తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో 'ప్రజా ఫిర్యాదుల వేదిక'

● ఎస్పీ మహేశ్వరరెడ్డి


ఫిర్యాదుదారుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

పలాస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): టెక్కలి, పలాస సబ్ డివిజన్ ప్రజలు శ్రీకాకుళం వచ్చి ఫిర్యాదులు చేసుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందువల్ల వారి కోసం పలాసలో ప్రజాఫిర్యాదుల వేదికను నిర్వహిస్తున్నామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన ఫిర్యాదులు స్వీకరించి అర్జీదారుల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 12 ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపి వాటి పరిష్కారానికి చట్టపరంగా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఉంద్రుకుడియా ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బొత్స షణ్ముఖరావును కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో ఎస్.తిరుమల చైతన్య శుక్రవారం తెలిపారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తూ ప్రత్యక్ష రాజకీయాల్లో పాల్గొనడం, పాఠశాలకు సక్రమంగా, సమయానికి హాజరు కాకపోవడం, గ్రామంలో జరిగే ప్రత్యక్ష తగాదాల్లో పాల్గొనడంతోపాటు విద్యార్థుల్లో విద్యాసామర్థ్యం లేకపోవడంతో పలు ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

వదంతులు నమ్మొద్దు

మెళియాపుట్టి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నా కుమార్తెకు రోడ్డు ప్రమాదం జరిగిందని, దుకాణాలకు నా పేరున గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందని, ఈ వదంతులను నమ్మి మోసపోవద్దని ఎస్ఐ రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పోలీసుల పేరు చెప్పి సైబర్ మోసాలకు పలువురు పాల్పడుతున్నారన్నారు. నాపేరుతో ఎవరు డబ్బులు అడిగినా సమాచారం అందించాలన్నారు. గూగుల్ ద్వారా ఫోన్ నెంబర్లు సేకరించి ఇటువంటి మోసాలకు పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

మెళియాపుట్టి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపర గ్రామానికి చెందిన క్కిక్కర అప్పలస్వామి(89) శుక్రవారం సాయంత్రం మర్రిపాడు-సి గ్రామానికి సమీపంలోని ఉల్లాస పేటకి చెందిన తోటలో అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు గుర్తించినట్లు పాత పట్నం ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వృద్ధుడి భార్య ఇటీవల మృతి చెందగా పిల్లలు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారని గ్రామస్థులు తెలిపారు. అయితే గడచిన 3 రోజులుగా వృద్ధుడు కనిపించకపోవడంతో కుమారులకు సమాచారం ఇవ్వ డంతో పెద్ద కోడలు చిన్నా గురువారం గ్రామానికి వచ్చి మావగారి కోసం గాలించారు. అయితే శుక్రవారం మర్రిపాడు గ్రామస్థులు పొలం పనులకు వెళ్లి చూడడంతో తోటలో వృద్ధుడి మృతదేహం గమనించి పోలీసు లకు సమాచారం అందించారు. పోలీసులు వెళ్లి చూసి మృతి చెందిన వ్యక్తి చాపర గ్రామస్థుడని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయి తే ఏం జరిగిందో తెలియదుగాని వృద్ధుడు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సారా తాగేందుకు వెళ్లి మృతి చెందాడా లేక మరే ఇతర కారణాలున్నాయా అన్న కోణంలో పోలీసులు ఆరా తీస్తు న్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

9 మందిపై బైండోవర్ కేసులు

మెళియాపుట్టి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) మండలంలోని తొమ్మిది మంది బెల్లం వ్యాపారుల పై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ ఎస్‌కే మీరాసాహిబ్ తెలిపారు. ఈ మేరకు వీరిని శుక్రవారం తహసీల్దార్ బి.పాపారావు ఎదుట హాజరుపరిచామన్నారు. ప్రతి వారం బెల్లం అమ్మకాల వివరాలు తెలియజేయాలన్నారు. తరచూ బెల్లం కొనుగోలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి సమాచారం ఇవ్వాలన్నారు. సారా తయారీకి బెల్లం అమ్మితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

మద్యంతో ఒకరి అరెస్టు

జి.సిగడాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన సిరుగుడు గోవిందరావు 128 మద్యం సీసాలు అక్రమంగా తరలిస్తూ పట్టుబడినట్టు తెలిపారు. ఎస్పీఆర్ పురం వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా మోపెడ్‌పై వెళ్తున్న గోవిందరావు వాహనాన్ని తనిఖీ చేసి 116 క్వార్టర్ సీసాలు, 12 బీరు సీసాలు స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్టు చెప్పారు. గోవిందరావును పొందూరు కోర్టుకు తరలించగా రిమాండ్ నిమిత్తం శ్రీకాకుళం తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా లలితా సహస్రనామ పారాయణం

జలుమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక షిర్డీసాయి ఆలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం లలితాసహస్ర నామ పారాయణం భక్తిశ్రద్ధలతో చేపట్టారు. రాత్రికి భక్తులు దీపారాధన చేశారు. కార్యక్రమంలో మురళీమోహనరావు, రొక్కం కృష్ణారావు, భానోజీరావు పాల్గొన్నారు.

శ్రీముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

పాతపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు అమ్మవారిని దర్శించుకుని ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు కార్యక్రమంలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సన్మార్గంలో నడిచేందుకు దోహదం

జలుమూరు, (సారవకోట) ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికత కలిగి ఉండడం ద్వారా సన్మార్గంలో నడిచేందుకు అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకొని కోదడ్డపనస గ్రామంలో వెలిసిన అయ్యప్ప స్వామిని శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, నాయకులు బైరి భాస్కరరావు, పట్ట ఉమారావు, సాధు చిన్నికృష్ణంనాయుడు పాల్గొన్నారు.

శివాలయంలో చొరబడిన నెమలి


శివలింగం వద్ద నెమలిని పట్టుకున్న అర్చకుడు

పలాస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాజీనగర్ ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయం మూసిన వేసిన తరువాత ఒక నెమలి చొరబడిన ఘటన గురువారం రాత్రి సంభవించిది. దీనిని గమనించిన అర్చకుడు కాశీబుగ్గ అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సెక్షన్ అధికారి రాజు సిబ్బందితో చేరుకుని నెమలిని స్వాధీనం చేసుకుని కోసంగిపురం మెండు ఫారెస్ట్‌లో విడిచిపెట్టారు. నీటి కోసం నెమళ్ల గ్రామాల్లోకి వస్తున్నాయని, వీటిని పరిరక్షించి తమకు సమాచారం అందించాలని వారు కోరారు. నెమలి నేరుగా శివలింగం ఉన్న ప్రాంతంలో తలదాచుకుంది. దీంతో అంతా ఆశ్చర్యపోయారు.

ఆదర్శనీయుడు జ్యోతిబా పూలే

ఆదర్శనీయుడు జ్యోతిబా పూలే అని పలువురు వక్తలు అన్నారు. జ్యోతిబా పూలే 199వ జయంతిని శుక్రవారం జిల్లాలో పలు ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.


పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

బీసీల ఆత్మబంధువు..

నరసన్నపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీసీల కోసం పాటుపడిన వ్యక్తి పూలే అని, బీసీల ఆత్మబంధువు అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. నరసన్నపేట టీడీపీ కార్యాలయంలో పూలే చిత్ర పటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూలే ఆశయాలను అన్న ఎన్టీఆర్ ఆచరిస్తే, నేటి సీఎం చంద్రబాబు కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నాయకులు గొద్దు చిట్టిబాబు, మెండ రాంబాబు, ఉణ్న వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సేవలు ఆదర్శనీయం

రణస్థలం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే సేవలు ఆదర్శనీయమని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా శుక్రవారం రామతీర్థం జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు డీజీఎం ఆనందరావు, పిసిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, కనకారావు పాల్గొన్నారు.

ఆశయ సాధనకు కృషి చేయాలి

పాతపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అరసవల్లి: శాంతినగర్‌లోని గాంధీ మందిరంలో..


రణస్థలం: నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు


ఎచ్చెర్ల: ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళి

వైసీపీ పాలనలో పల్లెల్లో అభివృద్ధి శూన్యం

● జూన్‌లో 'తల్లికి వందనం' ● మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

టెక్కలి/నందిగాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల కాలంలో పల్లెల్లో అభివృద్ధి పడకేసిందని, ప్రస్తుతం సీఎంగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన తరువాత రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శుక్రవారం నర్సిపురం-బూరగాం, నందిగాం మండలం దిమిలాడలో సీసీ రోడ్డు, దిమిలాడ-బూరగాం- లింగాలపాడు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పనిచే స్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉన్నా ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా నెరవేరుస్తామన్నారు. పల్లెల ప్రగతికి రహదారులే కీలకమన్నారు. జూన్‌లో పాఠశాలలు పునఃప్రారంభం నాటికి 'తల్లికి వందనం' పథకం ద్వారా అర్హులైన తల్లుల ఖాతాలో రూ.15 వేలు జమ చేస్తామన్నారు. అనంతరం బూరగాంలో రూ.7 లక్షల వ్యయంతో సీసీ రోడ్డును ప్రారంభించారు. అచ్చెన్నాయుడు ద్విచక్రవాహనంపై పర్యటిస్తూ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.


టెక్కలి: శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కార్యక్రమంలో ఆర్డీవోలు ఎం.కృష్ణమూర్తి, జి.వెంక టేష్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జామి సుధాకర్, ఈఈ సత్యనారాయణ, డీఈఈ రవికాంత్, టీడీపీ నాయకులు బగాది శేషగిరి రావు, పినకాన అజయ్‌కుమార్, మళ్ల బాలకృష్ణ, పి.చంద్రశేఖర్, లోకనాథం, జీరు నానీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాలను రైతులకు అద్దెకివ్వాలి


వ్యవసాయ యంత్ర పరికరాలను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

టెక్కలి, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను అవసరమైన ఇతర రైతులకు తక్కువ ధరకు అద్దెకు ఇవ్వాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. 2021, 2023 సంవత్సరాల్లో రైతు సేవా కేంద్రాల పరిధిలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హైరింగ్ కేంద్రం(సీహెచ్‌సీ)లను శుక్రవారం ఆయన సందర్శించారు. నర్సింగపల్లి రైతు సేవా కేంద్రం సీహెచ్‌సీకి అందించిన యంత్ర పరికరాలు, వాటి వినియోగం, బ్యాంకు రుణం చెల్లింపు, ఇతర రైతుల వినియోగం తదితర అంశాలను గ్రూపు సభ్యులను, వీఏఏ వై.యమునను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఏలు బీవీ తిరుమలరావు, టి.భవానీ శంకర్, ఎంవో రంగారావు, రైతులు పోలాకి షణ్ముఖరావు, తిరుపతిరావు, జి.సత్యం, దారపు రాము, రట్టి బైరాగి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

ఎల్.ఎన్.పేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందిస్తున్న వ్యవసాయ యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి పి.లతాశ్రీ తెలిపారు. లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి గ్రామాల రైతు సేవాకేంద్రాల ద్వారా రైతులకు అం దించిన యంత్ర పరికరాలను శుక్రవారం పరిశీలించారు. పరికరాలు పొందిన రైతులు తమ సొంత వ్యవసాయంతో పాటు తోటి రైతులకు ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనిముట్లను వినియోగించుకోండి

జలుమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల పరిధిలోని కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లలో ఉన్న వ్యవసాయ పనిముట్లను రైతులు అద్దెకు వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి కె.సురేష్ తెలిపారు. జోనంకి, పెద్దదూగాం రైతు సేవా కేంద్రాలను శుక్రవారం సందర్శించి వ్యవసాయ పనిముట్లను పరిశీలించారు. వీఏఏలు రాజశేఖర్, ఝాన్సీ, పలువురు రైతులు పాల్గొన్నారు.

11 ఏళ్లలో దేశం అభివృద్ధి

పలాస/కాశీబుగ్గ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో దేశం ప్రపంచాన్ని శాసించే స్థాయికి వెళ్లారని బీజేపీ రాష్ట్ర పదాధికారి పైడి వేణు గోపాల్ అన్నారు. శుక్రవారం 'పల్లెకు పోదాం'లో భాగంగా కోసంగిపురం జీడి పరిశ్రమలో కార్మికులతో రచ్చబండ నిర్వహించారు. రామకృష్ణ, వివేకానంద ఆశ్రమాన్ని సందర్శించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పైల రాజరత్నం నాయుడు, కొర్రా యి బాలకృష్ణ యాదవ్, పాలవలస వైకుంఠరావు, రామానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం'తో సమస్యల పరిష్కారం


అంగన్‌వాడీ కేంద్రంలో సమస్యలను తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

హరిపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): 'పల్లెకు పోదాం'లో సమస్యలను గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా మని బీజేపీ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రౌతు చిరంజీవిరావు అన్నారు. కుసుమాల, కొండలోగాం గ్రామాల్లో శుక్రవారం పల్లెకు పోదాం నిర్వహించారు. అంగన్‌వాడీ, సచివాలయం, పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు టి.సురేష్, నాయకులు ఇప్పిలి వెంకటరావు, సవర ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

విప్లవ పోరాటయోధుడు 'పైల'


పైల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

వజ్రపుకొత్తూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సాయుధ పోరాటంలో ప్రముఖపాత్ర పోషించి పేదల పక్షాన నిలిచిన వ్యక్తి పైల వాసుదేవరావు అని, ఆయనను ఆదర్శంగా తీసుకుని సమస్యలపై పోరాటం చేయాలని సీపీఐ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు అన్నారు. శుక్రవారం పైల వాసుదేవరావు వర్ధంతి సందర్భంగా రిట్టపాడులో పైల స్మారక స్థూపం వద్ద నివాళి అర్పించారు. సమరశీల పోరాటాలను నిర్మించడం తక్షణ కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినోద్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగించాలి

పాతపట్నం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సందప తయారీ కేంద్రాలను వినియో గంలోకి తీసుకురావాలని టెక్కలి డీఎల్పీవో గోపిబాల అన్నారు. సీతారాంపల్లిలో ఈ కేంద్రాన్ని పరిశీలించారు. నిరుపయోగంగా ఉంచడం సబబుకాదన్నారు. వినియోగంలోకి తీసుకువచ్చి సేంద్రియ ఎరువును తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎల్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీ ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న కమిషనర్ ఎన్.రామారావు

పలాస, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ ఆర్థిక పరిపుష్టికి చర్యలు తీసుకోవా లని కమిషనర్ ఎన్. రామా రావు కోరారు. శుక్రవారం ముని సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, మునిసిపల్, నోడల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పారిశుధ్య పనులు, తాగు నీటి సరఫరా, లైటింగ్, రోడ్ల మరమ్మతులు, కాలువల నిర్మాణం కోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మునిసిపల్ ఆదాయం పెంపొందించే మార్గాలను అన్వేషించాలని, పన్నుల వసూలుపై ప్రజలకు ఇబ్బంది పెట్ట కుండా లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. అంతకు ముందు జియో ట్యాగింగ్, వర్క్ ఫ్రమ్ హోమ్, చిల్డ్రన్ విత్ ఆధార్, డెత్ ఆడిట్ రీ వెరిఫికేషన్, పీజీఆర్ఎస్, ఈకెవైసీ తదితర అంశాల ప్రగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకరరావు, ఆర్ఐ అమర్ పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఓటర్ల జాబితాల్లో తప్పులను సవరించాలి

నరసన్నపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల్లో ఉన్న తప్పులను సవరించే బాధ్యత బీఎల్వోదేనని ఈఆర్వో లావణ్య అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కొత్త ఓటర్ల చేర్పు, తొలగింపు లను పరిశీలించి పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. డబుల్ ఎంట్రీలను తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, ఎలక్షన్ డీటీ శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు.

రీ సర్వేని సద్వినియోగం చేసుకోండి

జలుమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న భూముల రీసర్వేని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జన్ని రామారావు కోరారు. తలతరియా, లింగాలపాడులో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇదివరలో జరిగిన తప్పులను సరి చేసేందుకు ఈ రీ సర్వే దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చల్ల షణ్ముఖరావు, ఆర్ఐ కిరణ్, మండల సర్వేయర్ తర్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిర్మాతలను కలిసిన ఎమ్మెల్యే శిరీష

పలాసరూరల్,ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష హైదరాబాద్ పర్యటనలో భాగంగా శుక్రవారం ప్రముఖ నిర్మాత చలసాని అశ్వనీదత్, సురేష్ ప్రొడక్షన్స్ అధినేత దగ్గుబాటి సురేష్‌బాబులను మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. అలాగే ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి దేవేంద్రగౌడ్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. ఆమెతో పాటు టీడీపీ పలాస నియోజకవర్గ కన్వీనర్ వెంకన్నచౌదరి ఉన్నారు.

ఆర్ఆర్ కాలనీల్లో ప్రత్యేక సర్వే

కొత్తూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కొత్తూరు మండలం మెట్టూరు బిట్-1, బిట్-2 వంశధార నిర్వాసితుల కాలనీ లేఅవుట్‌లో సర్వే చేసి ఐదు రోజుల్లోగా నివేదిక అందించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దార్ రవిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాసిత కాలనీలో అక్రమాలు, రిజర్వు స్థలాలు ఆక్రమణలు జరిగాయని, ఒక్కో వ్యక్తికి రెండేసి పట్టాలు ఇతర నిర్వాసిత కాలనీలో పొందారని పలువురు గ్రామస్థులు టెక్కలి ఆర్డీవోకి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో ఆర్డీవో ఆదేశాల మేరకు నిర్వాసిత కాలనీలో రీ సర్వేకి నాలుగు బృందాలను ఏర్పాటు చేశామ న్నారు. లబ్ధి పొందిన వ్యక్తి అర్హుడా కాదా అనే విషయాలను సర్వే చేసి నివేదిక అందించాలని ఆదేశించామన్నారు.

రూపు కోల్పోతున్న కాలువలు

కాలువల ఆధునికీకరణ లేకపోవడం, పూడికలు పెరిగిపోవడంతో సాగునీటి కాలువలు రూపాన్ని కోల్పో తున్నాయి. కాలువల్లో చెత్తా చెదారాలతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో సాగునీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో సాగునీరందించాలంటే కాలువల ఆధునికీకరణ తప్పనిసరి.


పలాస సీతమ్మగుడి ప్రాంతంలో పూడుకుపోయిన దేశబట్టి-వంశధార కాలువ

పలాస, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరందించే వంశధార- దేశబట్టి కాలువ ఇది.. మట్టి, మురుగు, చెత్తా చెదారాలతో నిండి తన రూపునే కోల్పోయింది. ఈ కాలువ ద్వారా సుమారు 6వేల ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. అయితే గడచిన రెండు దశాబ్దాలుగా ఎటువంటి ఆధునికీకరణ పనులు లేకపోవడంతో రోజు రోజుకు కుచించుకుపోతోంది. ప్రస్తుతం వేసవిలో కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టకపోతే ఈ ఏడాది సాగు నీరందే పరిస్థితి లేదని ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. హరిసాగరం, వరహాల గెడ్డ నీరు దేశబట్టి కాలువ మీదుగా పలాస సీతమ్మగుడి ప్రాంతంలో వంశధార కాలువలో కలిసి పలాస, వజ్రపుకొత్తూరు మండలాలకు సాగునీరందించేది. దేశబట్టి కాలువ మురదరాజపురం నుంచి పలాస వరకు సుమారు ఐదు కిలోమీటర్లు ఉంది. అక్కడి నుంచి వంశ ధార కాలువకు అనుసంధానమై చెరువులకు చేరి అక్కడి నుంచి పంట పొలాలకు సాగునీరందించేది. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఇది సాగునీటి కాలువ, లేక మురుగు కాలువ అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీ వర్షాలు వచ్చినా పిల్లకాలువ మాదిరిగా నీరు ప్రవహిస్తుందే తప్ప ప్రయోజనం కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. కాలువ ఆధునికీకరణ పనులు చేపడితే అదనంగా మరో 2 వేల ఎకరాలకు సాగునీరందించేందుకు అవకాశం ఉందని, ఈ దిశలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

● శిథిలావస్థలో కేశుపురం అక్విడెక్ట్


కేశుపురం వద్ద శిథిలావస్థకు చేరిన అక్విడెక్ట్, కాలువలో మొలిచిన పిచ్చి మొక్కలు

పలాసరూరల్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పలాస మండలంలో పంట పొలాలకు సాగునీరందించేందుకు ఉద్దేశించిన వంశధార కాలువలో పూడికలు పేరుకుపోవడంతో పాటు పిచ్చిమొక్కలు మొలిచి సాగునీటి ప్రవాహానికి అటంకంగా మారాయి. టెక్కలి మీదుగా నందిగాం, పలాస మండలాలకు సాగునీరు వచ్చేందుకు గాను కేశుపురం వద్ద వంశధార కాలువపై ఏర్పాటు చేసిన అక్విడెక్ట్ శిథిలావస్థకు చేరుకుంది. గడ చిన కొన్నేళ్లుగా ఎటువంటి నిర్వహణ లేకపోవడంతో అక్విడెక్ట్ గోడలు పాడయ్యాయి. బీటలు వారి నాచు ఏర్పడింది. అలాగే కాలువలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. అక్విడెక్ట్ స్తంభాలు శిథిలావస్థకు చేరడం, నీటి ప్రవాహం వెళ్లే మార్గంలో లీకేజీలు ఏర్పడడంతో నీరు వృథా అవుతోంది తప్ప రైతులకు ఎటువంటి ప్రయోజనం చేకూరడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టి ఖరీఫ్ సీజన్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. దీనిపై వంశధార జేఈ రాజశేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఎస్‌డీఆర్ఎఫ్ కింద చిన్న మరమ్మతులు చేపట్టామని, పిచ్చిమొక్కల తొలగింపునకు నిధులు లేవని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, త్వరలో పనులు పూర్తి చేస్తామన్నారు.